# వార్షిక లాభాల్లో 40 శాతం కార్మికులకు చెల్లించాలి






జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

మంగళవారం 6 అక్టోబర్ 2026 పేజీలు : 8


# రెవెన్యూ, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక దృష్టి



అధికారులకు మంత్రులు పొంగులేటి, జూపల్లి ఆదేశాలు

**ఆసిఫాబాద్ అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ సేవలు, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు. కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ కె.హరితతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి



# బ్యాంక్ అధికారులమంటూ సైబర్ మోసాలు నిందితుడి అరెస్ట్

క్రెడిట్ కార్డు వివరాలు, ఓటి పిలు ఆదిలాబాద్ బాధితుని వద్ద రూ.73,279 మోసం

మహారాష్ట్ర, గోవా, తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు 15 0 ఫిర్యాదులు నమోదు

మూడు రాష్ట్రాల బాధితుల వద్ద 95 లక్షల వరకుమోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

మహారాష్ట్రలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఆదిలాబాద్ 1 టౌన్ పోలీసులు

నిందితుడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం

# కాకా ఆశయాల సాధనకు కృషి చేస్తాం

యువతకు ఉపాధి, పేదలకు న్యాయం, సామాజిక న్యాయం కోసం పోరాటం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



# 2027-28 ఉత్పత్తి లక్ష్యాలపై సింగరేణి కసరత్తు



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** 2027-28 ఆర్థిక సంవత్స రానికి సింగరేణి కాలరీస్ కంపెనీ ఏరియాల వారీగా ఉత్పత్తి లక్ష్యాల ను నిర్ధారించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని ఏరియాల్లో పర్యటించి గనుల వారీగా ఉత్పత్తి సామర్థ్యం, ప్రస్తుత ఉత్పత్తి పరిస్థితులు, వర్కింగ్ ప్లేస్‌లు, భవిష్యత్ డెవలప్ మెంట్ ప్రణాళికలు, అవసరమైన యంత్రాలు,

# మంచిర్యాల జిల్లా బిజెపి నాయకులపై ఆరోపణలు



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరబల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్ తీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకులు బొలిశెట్టి తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మడిపల్లి సత్యనారాయణలు సోమవారం ఆరోపణలు చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా పార్టీలో వెరబల్లి రఘునాథ్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఆయనకు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అండగా ఉంటూ పనిచేస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో పార్టీని బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ నాయకులను అణచివేస్తూ, రఘునాథ్‌కు అనుకూలంగా వ్యవహరించే వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారని విమర్శించారు. రఘునాథ్ చుట్టూ ఉన్న కొంతమంది వ్యక్తులపై వివిధ రకాల ఆరోపణలు, కేసులు, వివాదాలు ఉన్నప్పటికీ వారికి పార్టీ పదవులు, బాధ్యతలు కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నిజాయితీపరులైన కార్యకర్తలను పక్కనపెట్టి, వ్యక్తిగత విధేయత చూపేవారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. ఎన్‌హెచ్--63 రహదారి అలైన్‌మెంట్ మార్పు విషయంలో కూడా రఘునాథ్‌పై వారు తీవ్ర ఆరోపణలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు, ఇతర వర్గాల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గతంలో పత్రికల్లో ప్రచురితమయ్యాయని తెలిపారు. అలైన్‌మెంట్ మార్పుల కారణంగా అమాయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సంబంధిత వర్గాలు వెల్లడించాల్సి ఉందన్నారు. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీ నిధుల వినియోగంలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపై ఇప్పటికే బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు. పార్టీ వ్యవహారాల్లో జరుగుతున్న అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినందుకే తమపై క్షక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బొలిశెట్టి తిరుపతి ఆరోపించారు. సీనియర్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, పార్టీతో సంబంధం లేదంటూ బహిరంగ ప్రకటనలు చేయడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు మడిపల్లి సత్యనారాయణపై ఎలాంటి కారణం లేకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడి సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. జిల్లా అధ్యక్షుడు తరచూ కొందరిపై ప్రకటనలు విడుదల చేయడం వల్లే వాటికి సమాధానంగా తాము కూడా మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపారు. ఇకపై పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలను సహించబోమని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వ్యవహారశైలి పై కూడా రాష్ట్ర పార్టీ ప్రత్యేక దృష్టి సారించి, పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. మంచిర్యాలలో బీసీ నాయకులు, కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పించేలా రాష్ట్ర నాయకత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఈ వ్యవహారంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# వార్షిక లాభాల్లో 40 శాతం కార్మికులకు చెల్లించాలి

## సింగరేణి లాభాలను వెంటనే ప్రకటించాలి

## రాష్ట్ర ప్రభుత్వం రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

## సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్‌లో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, లాభాల్లో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కూడా కోరారు . ఈ డిమాండ్ల సాధన కోసం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్‌కే-5 గనిలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఎస్ఆర్‌పీ-3 గనిలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా, ఆర్‌కే-7 గనిలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, ఎస్ఆర్‌పీ-1 గనిలో సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఎస్ఆర్‌పీ ఓసీపీ-లో సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఐకే-1ఏ గనిలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ఆర్‌కే-ఎన్‌టీ గనిలో జిల్లా కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి సంవత్సరం సంస్థ వార్షిక లాభాలను ప్రకటించి, అందులో వాటా చెల్లించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దసరా పండుగ సమీపిస్తున్నప్పటికీ ఈ ఏడాది సంస్థ లాభాలను యాజమాన్యం ప్రకటించకపోవడం సరికాదన్నారు. వెంటనే లాభాలను ప్రకటించి, అందులో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత సాధనలో కార్మికుల శ్రమ, అంకితభావం కీలకమని నాయకులు అన్నారు. కార్మికుల కష్టానికి తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ప్రసార సంస్థ (టీజీ ట్రాన్స్‌కో)ల నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బకాయిలు చెల్లిస్తే సింగరేణి ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతమవుతుందని, తద్వారా సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బొగ్గు ఉత్పత్తికి, కార్మికుల సంక్షేమానికి అవసరమైన మెటీరియల్, పరికరాలు, మౌలిక వసతులను సమకూర్చేందుకు కూడా నిధులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సింగరేణి సంస్థ ఆర్థిక పరిపుష్టికి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్మికుల న్యాయమైన హక్కులు, ప్రయోజనాల సాధన కోసం అవసరమైతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు సంపత్, అడ్డు శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, ఫిట్ కార్యదర్శులు గునిగంటి నరసింగరావు, మురళీ చౌదరి, దాడి రాజయ్య, మోతే లచ్చన్న, సారయ్య, ఆకుల లక్ష్మణ్, వెంకటేష్, రవి, సదానందం, మల్లికార్జున్, కుమారస్వామి, ఎర్ల సమ్మయ్య, సందీప్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటపై టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసుల దాడి

ఏడుగురు అరెస్ట్.. రూ.10,110 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** నెన్నెల మండలం అవడం గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా మూడు ముక్కలాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి అవడం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐలు దీకొండ రమేష్, లచ్చన్న, సిబ్బంది నెన్నెల పోలీసుల సహకారంతో దాడి నిర్వహించారు. ఈ దాడిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,110 నగదు, 52 పేకముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన ఏడుగురితో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నెన్నెల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. అక్రమ పేకాట, జూదం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పౌరసంబంధాల అధికారులు





**మంచిర్యాల, 5, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ఉమ్మడి జిల్లా సమావేశానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉమ్మడి జిల్లాల జిల్లా పౌర సంబంధాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమాచార, పౌరసంబంధాల శాఖకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన జిల్లా పౌరసంబంధాల అధికారులు పాల్గొన్నారు

# టైగర్ జోన్ ఆంక్షలతో కుంటుపడుతున్న మండల అభివృద్ధి. చుంచు రాజ్ కిరణ్






టైగర్ జోన్ ఆంక్షల వల్ల జన్నారం మండల అభివృద్ధి కుంటుపడిందని పెద్దపల్లి మరియు ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల జనసేన కోఆర్డినేటర్ చుంచు రాజ్ కిరణ్ అన్నారు. టైగర్ జోన్ రద్దుచేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని జన్నారం మండల కేంద్రానికి చెందిన సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాముల భూమా జారీ చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం చుంచు రాజ్ కిరణ్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ జోన్ ఆంక్షలు వల్ల జన్నారం మీదుగా వెళ్లే 4 వరుసల జాతీయ రహదారి ఆగిపోయిందని,సమీపంలో ఉన్న వాగులు, మత్స్యకారులను చేపలు పట్టకుండా చేస్తున్నారని, పశువుల మీద కోసం పశువులను అడవుల్లోకి అనుమతించడం లేదని, గోదావరి నుండి ఇసుక తీసుకరాకుండా చేయడం వలన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణాలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి కిలోమీటర్ వరకు తగ్గించే వరకు ప్రజల తరఫున జనసేన పార్టీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడడమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లక్ష్యమని ఆయన లక్షలకు అనుగుణంగానే మేమందరము ప్రజా సమస్యలపై పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అనంతరం మండలంలోని మురిమడుగు గ్రామానికి వెళ్లి సత్యసాయి నగర్‌లో గ్రామంలోని దళితుల ఇళ్లకు సమీపంలో అటవీశాఖ అధికారులు కందకాలు తవ్వడం సరికాదని చుంచు రాజ్ కిరణ్ అన్నారు. కందకాలలో పడి ఎవరైనా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతే అందుకు అటవీశాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి, ఇళ్లకు సమీపంలో తవ్విన కందకాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారుల తీరు రజాకర్ల పాలను గుర్తు చేస్తుందని అన్నారు.వారి తీరు మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు ఆవుల సాగర్ ,పవన్ కళ్యాణ్, చరణ్ ,మండల నాయకులు మూగల వెంకటేష్, బి. రాజ్ వెంకట్, బి. రాజేందర్, సంజీవ్, టి. బద్రి, సురేష్ గౌడ్, స్వరాజ్, సిద్ధార్థ, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు కాకా

డీసీపీ ఎ. భాస్కర్



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన కార్మిక పక్షపాతి, సామాజిక సేవకుడు గడ్డం వెంకటస్వామి (కాకా) అని డీసీపీ ఎ. భాస్కర్ అన్నారు. సోమవారం కాకా జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా కార్మిక శాఖ అధికారి క్రాంతి తదితర జిల్లా అధికారులు హాజరయ్యారు. కాకా చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ, దేశ ప్రగతికి కార్మికులే పునాది అనే బలమైన విశ్వాసంతో కాకా పనిచేశారని తెలిపారు. కార్మికులకు కేవలం వేతనాలు మాత్రమే కాకుండా 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' గౌరవం లభించాలనే భావనతో జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు, పేదలు, గుడిసెల్లో నివసించే ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. జాతీయ గుడిసెల సంఘం ద్వారా గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు నివాస సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారని, దాదాపు 30 కాలనీలలో ఇళ్ల ఏర్పాటుకు చేసిన కృషి పేదల జీవితాల్లో గణనీయమైన మార్పు



తీసుకువచ్చిందన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి సామాజిక న్యాయం కోసం పోరాడారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనే లక్ష్యంగా కాకా పనిచేశారని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని చెప్పారు. దేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాకా వెంకటస్వామి పేర్లు సార్వజనీన సంక్షేమం కోసం చేసిన సేవలకు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ప్రస్తుత కాలంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి పొందుతున్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కొత్త చట్టం తీసుకురావడంలో కాకా వారసులు కృషి చేశారని తెలిపారు. కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా గడ్డం వెంకటస్వామి (కాకా) ఆశయాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోల్ కార్మికుల బోనస్ గౌరవప్రదమైనది

**బీఎంఎస్ కోయిలా ప్రభారి, కోల్ ఇండియా అపెక్స్ సభ్యుడు లక్ష్మా రెడ్డి**




**మంచిర్యాల, 5, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ఈ ఏడా ది కోల్ కార్మికు లకు రూ.1,10, 250 బోనస్ లభించిందని బీఎంఎస్ కోయిలా ప్రభారి, కోల్ ఇండియా అపెక్స్ సభ్యుడు లక్ష్మా రెడ్డి తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, డిస్పాచ్‌లో కొంత తగ్గుదల ఉన్నప్పటికీ, బోనస్ విషయంలో కార్మికులకు గౌరవప్రదమైన ఒప్పందం కుదిరిందన్నారు. సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందం సాధ్య మైందని ఆయన తెలిపారు. ఆదివారం కోల్‌కతా నుంచి ధన్‌బాద్ చేరుకున్న లక్ష్మా రెడ్డికి ధన్‌బాద్ రైల్వే స్టేషన్‌లో బీఎంఎస్ ప్రదేశ్ కమిటీ సభ్యుడు, సీఎంపీఎఫ్ సభ్యుడు ఓం సింగ్‌తో పాటు పలువురు పదాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గత ఐదేళ్ల బోనస్ మొత్తాలను పరిశీలిస్తే ప్రతి ఏడాది బోనస్ పెరుగుతూ వచ్చిందని లక్ష్మా రెడ్డి తెలిపారు. ప్రస్తుత ఏడాది కూడా కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బోనస్‌పై ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు .

## రామప్పకు సింగరేణి మైనింగ్‌తో ముప్పు అవాస్తవం

**సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై నిర్ణయం ,సింగరేణి యాజమాన్యం స్పష్టిక**

**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ప్రపంచ వారసత్వ సంపద రామప్ప గుడికి సింగరేణి మైనింగ్ కార్యకలాపాలతో ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలు కేవలం అపోహ లు, అవాస్తవాలేనని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం సింగరేణి భవన్ నుంచి ప్రకటన విడుదల చేసింది.ములుగు జిల్లా వెంకటాపూర్ ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టాలని ప్రతిపాదించిన వెంకటాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్ర శాస్త్రీయ అధ్యయనం నిర్వహించిన అనంతరం మాత్రమే ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ అంశంపై భారత పురావస్తు శాఖతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలు నిర్వహించే శాస్త్రీయ అధ్యయనాలు, వాటి ద్వారా అందే నివేదికలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి, తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించబోదని స్పష్టం చేసింది. వారసత్వ సంపద పరిరక్షణకు సంస్థ పూర్తిగా కట్టుబడి ఉంటుందని వివరించింది.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమి స్తూ, చట్టబద్ధమైన మరియు పర్యావరణహితమైన మైనింగ్ కార్యకలాపాలకే సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని యాజమాన్యం పునరుద్ఘాటించింది.

## అటవీశాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ.




**జన్నారం,అక్టోబర్5(ప్రజాజ్యోతి)**జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఎఫ్డిఓ రామ్మోహన్ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఓ బాబా ఖాదర్ వలీ ఆధ్వర్యంలో శనివారం రోజున అటవీ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.మండలంలోని ఇందనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. వన సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాల ని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారిని మమత అటవీ శాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు

## అంగన్వాడీ టీచర్లు జాతి నిర్మాతలు

**బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమీర్‌శెట్టి రాజ్‌కుమార్**



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ గర్మిళ్ల జోన్‌లో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమీర్‌శెట్టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రీ-స్కూల్ విద్య అందించడంతో పాటు ఆటపాటల ద్వారా వారి బుద్ధి వికాసానికి అంగన్వాడీ టీచర్లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందిస్తూ అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఒక వ్యక్తి భవిష్యత్తులో ఇంజనీర్‌గా, డాక్టర్‌గా, శాస్త్రవేత్తగా, కలెక్టర్‌గా ఎద గాలంటే ఆ విద్యాభివృద్ధికి తొలి పునాది అంగన్వాడీ కేంద్రాలేనని, అందుకే అంగన్వాడీ టీచర్లను జాతి నిర్మాతలుగా అభివర్ణించ వచ్చన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను పోషణ్ అభియాన్‌లో భాగం చేసిందని, అంగన్వాడీ సిబ్బందికి బీమా, స్మార్ట్‌ఫోన్లు వంటి సౌకర్యాలు కల్పించిందన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు తక్కువగా ఉన్నప్పటికీ అంకితభా వంతో సేవలు కొనసాగిస్తున్నారని రాజ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ టీచర్లు, ఆయాల వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో పాటు బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా గర్మిళ్ల జోన్ అధ్యక్షులు ముల్కల్ల కుమార్, నరేందర్, రజిత, శ్రావణి, పద్మ, శ్రావణి తదితర మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి.



**తాండూర్ అక్టోబర్ 05 ప్రజాజ్యోతి** తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలతో, బెల్లంపల్లి వైస్ ప్రెసిడెంట్ సూచన మేరకు గత ఆర్థిక సంవత్సరం (2025-26)కి వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని, అలాగే వచ్చిన లాభాలలో ఎలాంటి మినహాయింపులు లేకుండా 36 శాతాన్ని (36%) కార్మికులకు కేటాయించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం తరఫున సోమవారం ఏరియా వర్క్‌షాప్ ఇన్‌ఛార్జ్ నరేష్ సర్ కి మెమొరాండం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్‌షాప్ పిట్ సెక్రటరీ గాజవెని శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యులు ధారవత్ మంగీలాల్, ఏరియా జాయింట్ సెక్రటరీ – జి. వెంకట్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఎస్. సురేష్, నాయకులు గణపతి. వైకుంఠం, ఎస్. వెంకటేశ్వర్లు, కనకయ్య, వెంకటస్వామి, అంజయ్య, చంద్రయ్య మరియు మహిళా కార్మికులు అలాగే వర్క్‌షాప్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు,

## భారత్ కళా పురస్కార్ అవార్డు అందుకున్న తాండూర్ ఫోటోగ్రాఫర్ రంజిత్...




**తాండూర్: అక్టోబర్ 5 ప్రజాజ్యోతి** ఫోటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న తాండూర్ కి చెందిన మారుమొకం రంజిత్ కు ప్రతిష్ఠాత్మక భారత్ కళా పురస్కార్ అవార్డులు అందుకోవడం విశేషంగా నిలిచింది.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, ఫోటో పరివార్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోటో ట్రేడ్‌షోలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఫోటోగ్రాఫర్లను ఎంపిక చేసి భారత్ కళా పురస్కారాలతో సత్కరించారు.ఈ సందర్భంగా తాండూర్ కి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ మారుమొకం రంజిత్ కు బెస్ట్ ఆల్బమ్ డిజైనర్ అవార్డు, లభించిందిసుదీర్ఘకాలంగా ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న మారుమొకం రంజిత్ సంప్రదాయ ఫోటోగ్రఫీలో తనదైన శైలిని ఏర్పరుచుకున్నారు. వివిధ శు భకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల ను తన కెమెరాలో అందంగా బంధిస్తూ ఫోటోగ్రఫీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు.ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న మారుమొకం రంజిత్ ఆల్బమ్ డిజైనింగ్, వెడ్డింగ్ ఫోటోగ్రఫీలో సహజమైన భావోద్వేగాలను, ప్రత్యేక సందర్భాలను కెమెరాలో అద్భుతంగా బంధిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఈ క్రమంలో బెస్ట్ క్యాండిడ్ ఫోటోగ్రాఫర్‌గా అవార్డు అందుకో వడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఫోటోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేశారు.భారత్ కళా పురస్కారాలు అందుకున్న మారుమొకం రంజిత్ కు తాండూర్ పట్టణానికి చెందిన ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, బంధువులు అభినందించారు. భవిష్యత్తులో ఫోటోగ్రఫీ రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కేసముద్రం రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలి

**వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు తప్పని మెట్ల కష్టాలు**

**మరో వైపు టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్**

**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. కేసముద్రం మున్సిపాలిటీ వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, రైస్ మిల్లులు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. న్యూ ఢిల్లీ--చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో కేసముద్రం స్టేషన్ ఉండటంతో దీని ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. పద్మావతి, శాతవాహన, గోల్కొండ, కృష్ణ, అండమాన్, లక్నో తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సింగరేణి, కాకతీయ, పుష్‌పుల్ వంటి రైళ్లకు కూడా ఇక్కడ హాల్ట్ సౌకర్యం ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. అయితే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మూడు ప్లాట్‌ఫారమ్‌ల మధ్య రాకపోకలకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జినే ప్రధాన మార్గంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నపిల్లలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎత్తుగా ఉండటంతో పాటు మెట్లు ఎక్కువగా ఉండటంతో వృద్ధులు ఒక్కో మెట్టు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారని, కొందరు మధ్యలోనే ఆగి విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోందన్నారు. మహిళలు చిన్నపిల్లలు, లగేజీతో మెట్లు ఎక్కడం కష్టంగా మారిందని చెప్పారు. రైలు వచ్చే సమయంలో ప్రయాణికులు హడావుడిగా మెట్లు ఎక్కాల్సి రావడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఉందన్నారు. అదేవిధంగా స్టేషన్‌లో ఒకే వైపు టికెట్ కౌంటర్ ఉండటం వల్ల




కూడా ప్రయాణికులకు అదనపు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. టికెట్ కోసం ఒక వైపు వెళ్లి, తిరిగి రైలు ఎక్కేందుకు మరో ప్లాట్‌ఫారమ్‌కు చేరుకోవాల్సి రావడం వృద్ధులు, దివ్యాంగులు, నడవడానికి ఇబ్బంది పడేవారికి సమస్యగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తూ లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఇతర ఆధునిక సౌకర్యాలను కల్పిస్తున్న నేపథ్యంలో కేసముద్రం రైల్వే స్టేషన్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే అభివృద్ధి అంటే కేవలం రైళ్ల సంఖ్య పెంచడం మాత్రమే కాకుండా, ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్లాట్‌ఫారమ్‌లకు చేరుకునేలా మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా ముఖ్యమని అన్నారు. కేసముద్రం పరిసర ప్రాంతాల్లోని గిరిజన తండాల ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం రైలు ప్రయాణాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. తక్కువ ఖర్చుతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వే అత్యంత అనుకూలమైన రవాణా మార్గమని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యతగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, మూడు ప్లాట్‌ఫారమ్‌లకు సులభంగా చేరుకునే విధంగా లిఫ్ట్



సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అవసరాన్ని బట్టి ఎస్కలేటర్‌ను కూడా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే మరో వైపు టికెట్ కౌంటర్ ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయాలని కోరారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను రైల్వే అధికారులు మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకుని కేసముద్రం రైల్వే స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. ప్రయాణికుల సమస్యలను తెలుసుకుని లిఫ్ట్, ఎస్కలేటర్, అదనపు టికెట్ కౌంటర్ వంటి సౌకర్యాల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి వాస్తవ లాభాలపై కార్మికులకు 36 శాతం చెల్లించాలి



**ఆరు నెలలుగా లాభాల ప్రకటనలో జాప్యం తగదు**

**రూ.6,323 కోట్లు పక్కన పెట్టడంపై సరి కాదు**

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు**

**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి ఆర్జించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, ఆ లాభాల్లో 36 శాతం కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు . ఈ ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించకపోవడం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉందని సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో మేనేజర్లు, హెచ్ఓడీలకు వినతిపత్రాలు



అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా వాస్తవ లాభాల ఆధారంగా కార్మికులకు చెల్లింపులు చేయకుండా, సంస్థ అభివృద్ధి పేరుతో రూ.6,323 కోట్లను పక్కన పెట్టడాన్ని సంఘం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థ లాభాలను ఆర్జిస్తోందని, అందువల్ల ఈ ఆర్థిక సంవత్సరానికి వచ్చిన వాస్తవ లాభాల్లో 36 శాతం వాటాను కార్మికులకు అందించి వారి శ్రమను గౌరవించాలని నాయకులు డిమాండ్ చేశారు. లాభాల ప్రకటనను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్కే న్యూటెక్ గనిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీలాల, పిట్ సెక్రటరీ జైపాల్‌రెడ్డి పాల్గొని వినతిపత్రం అందజేశారు. ఆర్కే-5 గనిలో కేంద్ర సంయుక్త కార్యదర్శి పొగాకు రమేష్, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి రామిడి మహేందర్‌రెడ్డి, పిట్ సెక్రటరీ దుర్గం రవికుమార్ పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ-1 గనిలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెట్టం లక్ష్మణ్, డివిజన్ నాయకులు తిరుపతిరావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ తిరుపతి; ఎస్ఆర్‌పీ-3 గనిలో కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దం రమణారెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి ఉత్తేజిరెడ్డి, పిట్ సెక్రటరీ తీగల వెంకటరెడ్డి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ తౌటి నరేష్ పాల్గొన్నారు. ఆర్కే-7 గనిలో శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి తొంగల రమేష్, పిట్ సెక్రటరీ రాజునాయక్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పాదం శ్రీనివాస్; శ్రీరాంపూర్ ఓసీలో కేంద్ర కార్యవర్గ సభ్యులు నీలం సదయ్య, పిట్ సెక్రటరీ గద్దం సుధాకర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జంగా రమేష్ పాల్గొన్నారు. ఐకే-1ఏ గనిలో శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి గొర్ల సంతోష్, పిట్ సెక్రటరీ గద్దం మల్లన్న, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రామారావు; ఐకే-ఓసీలో పిట్ సెక్రటరీ ధరణి దేవేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ దేవేందర్‌రెడ్డి; శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ఏరియా కార్యదర్శి బుస్సా రమేష్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ లక్ష్మణ్, డివిజన్ నాయకులు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# కాకా ఆశయాల సాధనకు కృషి చేస్తాం

## యువతకు ఉపాధి, పేదలకు న్యాయం, సామాజిక న్యాయం కోసం పోరాటం

## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** దివంగత ప్రజానాయకుడు తెలంగాణ ఉద్యమ యోధుడు కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తూ యువతకు ఉపాధి, పేదలకు న్యాయం, కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న కాకా వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కాకా సేవలను, పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా కాకా చూపిన ఆప్యాయత, ప్రేమాభిమానాలే నేడు అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చాయని వంశీకృష్ణ అన్నారు. అధికార, ప్రతిపక్షాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాకా అభిమానులు ఆయనకు నివాళులు అర్పించడం కాకా వ్యక్తిత్వానికి, ప్రజలతో ఆయనకున్న అనుబంధానికి నిదర్శనమన్నారు. తాను వ్యాపార రంగంలో ఉన్న సమయంలో దత్తాత్రేయ, జానారెడ్డి అందించిన సలహాలు, అండదండలను ఎప్పటికీ మరువలేనని తెలిపారు. కేకే, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్ తదితర పెద్దల ఆశీస్సులు, మార్గదర్శకత్వం చిన్నప్పటి నుంచే తనకు లభించాయని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాకా వెంకటస్వామి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, శరీరానికి బుల్లెట్ తగిలినా వెనక్కి తగ్గకుండా తెలంగాణ కోసం పోరాడిన యోధుడు కాకా అని కొనియాడారు. “తెలంగాణ వచ్చిన తర్వాతే నా ఆఖరి శ్వాస విడుస్తా” అని పట్టుదలతో చెప్పిన కాకా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి చూపించారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనను కాకా చూసి ఉంటే ఎంతో బాధపడేవారని వంశీకృష్ణ వ్యాఖ్యానించారు. కాకా లక్షలాది మంది నిరుపేదలు, కార్మికులకు ఇళ్ల స్థలాలు, గృహ హక్కులు కల్పించేందుకు అండగా నిలిచారని, అయితే గత పదేళ్లలో జరిగిన భూకబ్జాలు, భూదందాలు, ఇసుక మాఫియా వంటి పరిణామాలు చూస్తే బాధతో పాటు ఆగ్రహం కలుగుతోందని అన్నారు. కాకా కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కార్మికుల కోసం తీసుకొచ్చిన పెన్షన్



ఇప్పటికీ కేవలం రూ.500గా ఉండటం శోచనీయమని, కార్మికుల పెన్షన్‌ను నెలకు రూ.10 వేలకు పెంచాలని పార్లమెంట్‌లో గట్టిగా పోరాడుతున్నామని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని తెలిపారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) విషయంలో కాకా వెంకటస్వామి, మంత్రి వివేక్ వెంకటస్వామి కలిసి అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంతో పోరాడి సుమారు రూ.10 వేల కోట్ల ఆర్థిక భారాన్ని అధిగమించి సంస్థను పునరుద్ధరించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తోందని, అయితే సరైన నిర్వహణ లేకపోవడంతో పాటు ఢిల్లీ నుంచి అధిక జోక్యం కారణంగా సంస్థను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందేలా ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తీరుపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కాకా ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీలు) ద్వారా ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు . ప్రతి సంవత్సరం వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కార్యక్రమాలను విస్తరిస్తున్నామని తెలిపారు. కాకా వెంకటస్వామి మరో ముఖ్యమైన కల ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అని వంశీకృష్ణ అన్నారు. ఆదిలాబాద్ ప్రాంతంలో సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఇటీవల కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చర్చించినట్లు తెలిపారు.



ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి జరిగిన నేపథ్యంలో కాకా కలను సాకారం చేసే దిశగా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కాకా చూపిన పోరాట బాటలోనే ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పనిచేస్తామని, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి, ప్రజాసేవా వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడం అందరి బాధ్యత అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ వివరించారు.

# చెన్నూరులో ఘనంగా కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు

**సింగరేణి కార్మికుల పెన్షన్ పథకం ప్రవేశపెట్టిన ఘనత కాకాకే దక్కుతుంది**

**మంచిర్యాల,5, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** మాజీ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలను చెన్నూర్ మున్సిపల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.స్థానిక పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కాకా చిత్రపటానికి చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, కాకా వెంకటస్వామి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఏడు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాకా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల కోసం పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టడంలో కాకా వెంకటస్వామి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, మున్సిపల్ పట్టణ కన్వీనర్ లింగంపల్లి మహేష్, మున్సిపల్



కౌన్సిలర్లు అంబటి శంకర్, పెండ్యాల సాగర్, అజ్జు, మంత్రి లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న సూర్యనారాయణ, బాపిరెడ్డి, రాజమల్ల గౌడ్, ఎండి నవాజ్, సాధనబోయిన కృష్ణ, రామ్ లాల్ గిల్డ్, చింతల శ్రీనివాస్, సుశీల్ కుమార్, చెన్న వెంకటేష్, బత్తుల సమ్మయ్య, పాతాళ నాగరాజ్, చెన్నూర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలు పెంపు



తాండూర్ అక్టోబర్ 05 ప్రజాజ్యోతి పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్, లూబ్రికెంట్స్, స్పేర్ పార్ట్స్ ధరలను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీలను పెంచాలని తాండూర్ మండల ఆటో కార్మికులు నిర్ణయించారు. ఈ మేరకు అక్టోబర్ 7న బంద్ నిర్వహిస్తున్నట్లు తాండూర్ ఆటో యూనియన్ మండల అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు ఆరేళ్ల క్రితం డీజిల్ ధర రూ.54 ఉన్న సమయంలో ఆటో చార్జీలను పెంచామని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ఖర్చులతో జీవనం సాగించడం కష్టంగా మారిందని, దీనికి తోడు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస ఆటో చార్జీ రూ.20, బెల్లంపల్లికి రూ.30గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కొత్త చార్జీలు అక్టోబర్ 7వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రజలు, అర్థం చేసుకుని సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి) పోలీసుల కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు

**ఏఎస్ఐ,రాములు, పిసి శరత్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ లో భాగంగా**

**ఏలాంటి అనుమతి పత్రలు లేకుండా పారిగాం నుండి కర్జేపల్లి వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ టీఎస్ 20 టి 5031, ట్రాలీ టీఎస్ 20 టి 5030 పట్టివేత:**

**ట్రాక్టర్ ట్రాలీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నాం:**

**సిర్పూర్(టి) ఏఎస్ఐ పి. రాములు:**



**అక్టోబర్5,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) పోలీసులకు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు ఆదివారం ఏఎస్ఐ, పి,రాములు కానిస్టేబుల్ శరత్ కుమార్ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పారిగావ్ గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో పారిగావ్ నుండి కర్జేపల్లి వైపు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను తనిఖీ చేపట్టగా విచారణ లో భాగంగా ఏ1 ట్రాక్టర్ డ్రైవర్ సుఖదేవ్ వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేవని నిర్ధారించారు. వాహన యజమాని ఏ2 దేవ్డావే మారుతి సూచన మేరకు పారిగాం వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఇసుకతో పాటు ట్రాక్టర్ ట్రాలీని స్వాధీనం చేసుకొని ట్రాక్టర్ డ్రైవర్ ఏ1 సుఖ్దేవ్ కు పరమైన చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ,పి.రాములు తెలిపారు.

# ఫీజుల కోసం విద్యార్థులను వేధించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్**



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ఫీజుల చెల్లింపు విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్ఏ--1 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఫీజుల కోసం విద్యార్థులను వేధించడం, ఫీజులు చెల్లించలేదనే కారణంతో పరీక్షలకు అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేయడం, మానసికంగా వేధించడం జరుగుతోందని ఆరోపించారు. ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా పాఠశాల ల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా నస్పూర్ మండల కేంద్రంలోని మార్టిన్స్ గ్రామర్ హైస్కూల్‌లో విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం సెలవు రోజున కూడా పాఠశాలను నిర్వహించినట్లు ఆరోపించారు. విద్యార్థి ఆలస్యంగా వచ్చాడనే కారణంతో ఓ ఉపాధ్యాయుడు ఇనుప రాడ్‌తో దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, విద్యార్థిని శారీరకంగా గాయపరిచిన ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సెలవు రోజున పాఠశాల నిర్వహించిన అంశంపైనా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రత, హక్కుల పరిరక్షణకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఫీజుల పేరుతో విద్యార్థులను మానసికంగా వేధించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్, పూరెళ్ల నితీష్, రేగుంట క్రాంతి, బచ్చలి అభిరామ్, కుమ్మరి రాజబాబు, బచ్చలి జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం

**మూడు రోజుల్లో 6 కేసులు.. 500 మొక్కలు స్వాధీనం**

**రూ.50 లక్షల విలువైన గంజాయి మొక్కలు పట్టివేత**

**గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం: ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** జిల్లాలో అక్రమ గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా విస్తృత తనిఖీలు, ప్రత్యేక దాడులు కొనసాగుతున్నాయని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఆమె ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ సబ్‌డివిజన్ డీఎస్పీ బి.అశోక్ ఆధ్వర్యంలో లింగాపూర్, సిర్పూర్(యు), కెరమెరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత మూడు రోజులుగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు కేసులు నమోదు చేసి, ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. సుమారు రూ.50 లక్షల విలువైన 500 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.



**2025లో 39 కేసులు..**

2025లో అక్రమ గంజాయి సాగుకు సంబంధించి 39 కేసులు నమోదు చేసి 35 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1.13 కోట్ల విలువైన 1,134 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గంజాయి సాగుకు పాల్పడిన 20 మంది భూ యజమానులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని నిలిపివేశారు.

**ఈ ఏడాది 23 కేసులు**

2026లో ఇప్పటివరకు గంజాయి సాగుకు సంబంధించి 23 కేసులు నమోదు చేసి 27 మందిని అరెస్టు చేశారు. రూ.2.36 కోట్ల విలువైన 2,366 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. భూ యజమానుల వివరాలను తహసీల్దార్ల ద్వారా సేకరించి కలెక్టర్‌కు పంపనున్నట్లు ఎస్పీ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హత ఉన్న సంక్షేమ పథకాల లబ్ధిని నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**డ్రై గంజాయిపైనా చర్యలు**

2026లో ఇప్పటివరకు డ్రై గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి 32 కేసులు నమోదు చేసి 68 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుల్లో సుమారు రూ.3 లక్షల విలువైన 10 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో అక్రమ గంజాయి సాగు లేదా రవాణా, విక్రయాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# 2027-28 ఉత్పత్తి లక్ష్యాలపై సింగరేణి కసరత్తు







## శ్రీరాంపూర్ ఏరియాలో గనుల వారీగా ఉత్పత్తి సామర్థ్యం, యంత్రాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్ష

**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):**2027–28 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి కాలరీస్ కంపెనీ ఏరియాల వారీగా ఉత్పత్తి లక్ష్యాలను నిర్ధారించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని ఏరియాల్లో పర్యటించి గనుల వారీగా ఉత్పత్తి సామర్థ్యం, ప్రస్తుత ఉత్పత్తి పరిస్థితులు, వర్కింగ్ ప్లేస్‌లు, భవిష్యత్ డెవలప్‌మెంట్ ప్రణాళికలు, అవసరమైన యంత్రాలు, పనిముట్లు, మెటీరియల్స్ తదితర అంశాలను పరిశీలించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉత్పత్తి లక్ష్యాలను ఖరారు చేసేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించి గనుల వారీగా సమగ్ర వివరాలను సేకరించింది. శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ జీఎం (సీపీపీ అండ్ పీపీ) దేవెందర్తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత జీఎం మునిగంటి శ్రీనివాస్ కమిటీ సభ్యులను ఏరియా అధికారులకు పరిచయం చేశారు. అనంతరం కమిటీ చైర్మన్ దేవెందర్, సభ్యులు తమ పర్యటన ముఖ్య ఉద్దేశాన్ని అధికారులకు వివరించారు.జీఎం ఛాంబర్‌లో గనుల వారీగా ఉత్పత్తి లక్ష్యాల నిర్ణయంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ఆధారంగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఇంకా సాధించాల్సిన ఉత్పత్తి, మిగిలిన ఆరు నెలల్లో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయగలిగే అవకాశాలపై కమిటీ సభ్యులు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గనిలో ఉన్న వర్కింగ్ ప్లేస్‌లు, భవిష్యత్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు, ఉత్పత్తి సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి 2027–28 ఆర్థిక సంవత్సరానికి ఎంత ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించాలన్న దానిపై చర్చించారు.అదేవిధంగా రాబోయే ఆర్థిక సంవత్సరంలో గనుల ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అవసరమైన యంత్రాలు, పనిముట్లు, మెటీరియల్స్‌పై ఇంజనీరింగ్ అధికారులతో కమిటీ సభ్యులు చర్చించారు. ఒక్కో గనిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాలు, అదనంగా అవసరమైన యంత్రాలు, పనిముట్లు, ఇతర సామగ్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల లభ్యత, భవిష్యత్ అవసరాలపై కూడా సమీక్షించారు.

### ఉత్పత్తి వ్యయం తగ్గిస్తేనే పోటీలో నిలదొక్కుకోగలం

ప్రైవేట్ కంపెనీలు, కోల్ ఇండియా నుంచి సింగరేణికి పోటీ అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం అత్యంత కీలకమని కమిటీ చైర్మన్ దేవెందర్ పేర్కొన్నారు. సంస్థ పోటీలో నిలదొక్కుకుని మనుగడ సాధించాలంటే క్షేత్రస్థాయిలో పనివిధానాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాలని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఉత్పత్తి పెంపుతో పాటు కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్‌ను నియంత్రించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏరియాలో ఉద్యోగుల గైర్హాజరీ ఉత్పత్తి లక్ష్యాల సాధనపై కొంత ప్రభావం చూపుతోందని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఎస్‌డీఎల్ యంత్రాలు తరచూ మొరాయించడం కూడా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రధాన సమస్యగా మారిందని తెలిపారు. ఉద్యోగుల గైర్హాజరీ, ఎస్‌డీఎల్ యంత్రాల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. 2027–28 ఆర్థిక సంవత్సరానికి ఏరియాల వారీగా వాస్తవ ఉత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసి లక్ష్యాలను నిర్ధారించడమే కాకుండా, లక్ష్య సాధనకు అవసరమైన యంత్రాలు, మానవ వనరులు, పనిముట్లు, మెటీరియల్స్, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టార్గెట్ కమిటీ సభ్యులు జీఎం (ఈ అండ్ ఎం ఉపరితల గనులు) ఎలీషా, జీఎం (ఐ అండ్ పీఎం) నర్సింహారావు, ఏజీఎం (ఐఈడీ) వెంకయ్య, డీజీఎం (ఐ అండ్ పీఎం) గాబ్రియేల్ రాజు, డీజీఎం (ఈ అండ్ ఎం) చంద్రశేఖర్, డీజీఎం (పీపీ) మధర్, ఎస్ఓఎం (సీపీపీ) శ్యాంప్రసాద్, అడిషనల్ మేనేజర్ (మార్కెటింగ్) గంగాధర్, బెల్లంపల్లి రీజియన్ జీఎం (క్వాలిటీ) వీరభద్రరావు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి.రెడ్డి, ఎస్ఆర్‌పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్కే గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, ఏరియా ఇంజనీర్ సురేష్తో పాటు అన్ని గనుల మేనేజర్లు, ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ కొత్తపల్లి అనిత







**స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ గా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ వైస్ చైర్మన్ పోతు రాజుల లక్ష్మణ్, కోశాధికారిగా రతన్ గైన్ ఎన్నికల అధికారి జడ్పీసీఈఓ లక్ష్మీనారాయణ:**

**అక్టోబర్ 5, సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏకగ్రీవ ఎన్నికలో నూతన చైర్ పర్సన్ గా డాక్టర్. కొత్తపల్లి అనిత ను ఎన్నుకొన్నారు.అదే విధంగా స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబెర్ గా డాక్టర్.కొత్తపల్లి శ్రీనివాస్, వైస్ చైర్మన్ గా పోతురాజుల లక్ష్మణ్, గవర్నమెంట్ టీచర్ స్కూల్ అసిస్టెంట్ జియుపిఎస్ రవీంద్ర నగర్ నెంబర్ 2 రతన్ గైన్ ను జిల్లా కోశాధికారిగా నియమించారు.జిల్లా కమిటీ సభ్యులుగా డా. తిరుమలేష్, సునీల్ రెడ్డి, సుమిత్ర, హితేష్ అగర్వాల్, పూల రఘు, డా. ప్రవీణ్, పోతురాజుల మధు, కమలేష్ హాలధర్, రాజు, పోలోజు శ్రీనివాస్, పోతురాజుల రమేష్ లతో కలిసి కొమురం భీం ఆశిఫాబాద్ జిల్లా మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎన్నికల అధికారి జడ్పీసీఈఓ లక్ష్మీనారాయణ, సూపరిండెంట్ తోటజీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణుల ప్రాణాలు గాలిలోనా?

**మంచిర్యాలరూరల్అక్టోబర్05(ప్రజాజ్యోతి)**

**-గర్భిణీ మహిళల ప్రాణాలతో నర్సింగ్ హోంల వ్యాపారం**

ప్రైవేట్ వైద్యంపై నమ్మకంతో ఆసుపత్రి గడప తొక్కిన ఓగర్భిణి చివరకు విగతజీవిగా ఇంటికి చేరిన ఘటన మంచిర్యాల పట్టణంలో తీవ్ర కలకలం రేపుతోంది.పేరు మోసిన ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ప్రతిభ నర్సింగ్‌హోంలో గర్భిణి మహిళ మృతి చెందిన ఘటన పై మృతురాలి బంధువులు వైద్య నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు. గర్భంలోని శిశువు మృతి చెందిన విషయం వైద్యులకు తెలిసినప్పటికీ,సకాలంలో మహిళకు అవసరమైన వైద్య చికిత్స చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.

**--గర్భిణీల మృతి పై పట్టింపు కరువు**

గర్భిణి ఆరోగ్య పరిస్థితి ఎప్పటి నుంచి విషమించింది?శిశువు మృతి చెందిన విషయం ఎప్పుడు నిర్ధారణ అయింది? ఆతర్వాత ఎలాంటి వైద్య చర్యలు తీసుకున్నారు?అత్యవసర చికిత్స ఎందుకు అవసర మైన స్థాయికి చేరుకుంది?ఆసుపత్రిలోనే చికిత్స కొనసాగించాల్సిన పరిస్థితి ఉందా?లేక వెంటనే ఉన్నత వైద్య కేంద్రానికి తరలించాల్సి ఉందా?ఈ ప్రశ్నలకు సమాధానాలు కేస్‌షీట్,స్కానింగ్,ల్యాబ్ రిపోర్టులు,వైద్యుల నోట్స్, చికిత్స వివరాలు పరిశీలిస్తేనే బయటపడే అవకాశం ఉంది.

**--జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గర్భిణీ మృతి పై లైట్**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలపడం వారికీ చాలా సింపుల్.కానీ ఆ తనిఖీల తర్వాత లోపాలు సరిచేస్తున్నారా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటున్నారా? అన్నదే అసలు ప్రశ్న.ఆసుపత్రి రిజిస్ట్రేషన్ ఉందా!ప్రసూతి సేవలకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా?అత్యవసర ఆపరేషన్‌కు అవస రమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారా?రక్తం,ఆక్సిజన్, అత్యవస ర మందులు సిద్ధంగా ఉన్నాయా?గర్భిణి పరిస్థితి విషమించినప్పుడు రిఫరల్ ప్రోటోకాల్ పాటించారా?ఇలాంటి అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**--గత ఘటనల డిఎంహెచ్వో**

**గప్ చుప్**

మంచిర్యాల పట్టణంలోని బడా బడా ప్రైవేట్ నర్సింగ్ హోమ్ ఆసుపత్రుల్లో గతంలో గర్భిణులు మృతి చెందిన ఘటనలు అనేకం.కానీ పరిస్థితి విషమించి ఆరోపణలు,ఘటనలు వెలుగులోకి వచ్చిన చర్యలు శూన్యం.గత ఘటనలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని విచారణలు జరిగాయి?ఎన్ని ఆసుపత్రుల పై చర్యలు తీసుకున్నారు?ఎన్ని కేసుల్లో వైద్య నిర్లక్ష్యం లేదని తేలింది?ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి?ఈజలెక్కలను జిల్లా



వైద్య ఆరోగ్యశాఖ ప్రజల ముందు పెట్టాల్సిన అవసరం ఉంది.కానీ వారికి అవేమి పట్టవు వారు ప్రభుత్వ నిర్వహించే కార్యక్రమాలలో ఫుల్ బిజీ అంతేకాకుండా పిహెచ్సిల తనిఖీ నిర్వహణ ఇలా అనేక కార్యక్రమాలు కాలం వెల్లదీస్తున్నారు.

**--ఘటన అనంతరం అధికారులా తనిఖీలా?**

ఒక ఆసుపత్రిలో విషాద ఘటన జరిగిన అనంతరం అధికారులు స్పందించడం కంటే,అలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు పర్యవేక్షణ చేయడం ప్రభుత్వ శాఖ బాధ్యత.ముఖ్యంగా గర్భిణులు,ప్రసూతి సేవలు అందించే ఆసుపత్రుల విషయంలో పర్యవేక్షణ మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది.కేవలం ఆసుపత్రి భవనం,బోర్డు,రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించడం కాకుండా..రోగికి వాస్తవంగా ఎలాంటి వైద్యం అందుతోంది? అత్యవసర సమయంలో ఆసుపత్రి సామర్థ్యం ఎంత? అనే అంశాలపై తనిఖీలు జరగాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**--బాధిత కుటుంబానికి న్యాయం ఎలా?**

గర్భిణి మృతి ఘటనలో వైద్య నిర్లక్ష్యం ఉందా లేదా అన్నది స్వతంత్ర వైద్య నిపుణుల పరిశీలనతో తేల్చాలి.ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.ఆరోపణలు నిరాధారమని తేలితే ఆ విషయాన్ని కూడా అధికారికంగా ప్రజలకు వెల్లడించాలి.నిజం ఏదైనా ప్రజలకు




తెలియాలి. బాధిత కుటుంబానికి సమాధానం దొరకాలి.

**--డీఎంహెచ్ఓ పై ప్రశ్నల వర్షం**

ప్రతిభ నర్సింగ్‌హోంపై చివరిసారిగా ఎప్పుడు తనిఖీ జరిగింది? తనిఖీలో ఏ లోపాలు గుర్తించారు?ఆసుపత్రిపై గతంలో ఫిర్యాదులు వచ్చాయా?తాజా గర్భిణి మృతి ఘటనపై విచారణకు ఆదేశించారా?మృతురాలి వైద్య రికార్డులు పరిశీలించారా?వైద్య నిపుణుల కమిటీతో అభిప్రాయం తీసుకుంటారా?గత ఐదేళ్లలో జిల్లాలో నమోదైన ప్రైవేట్ ఆసుపత్రి ప్రసూతి మరణాలపై సమీక్ష జరిగిందా?లోపాలు ఉన్న ఆసుపత్రులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అని అధికారులు బహిర్గతపరచాలి.

**--ప్రజల ప్రాణాలతో వైద్యుల ప్రయోగాలా**

ప్రైవేట్ వైద్యం అంటే కేవలం వ్యాపారం కాదు---ప్రాణాలకు సం బంధించిన బాధ్యత.ముఖ్యంగా ప్రసూతి వైద్యంలో ప్రతి నిమిషం కీలకం.అందుకే తాజా ఘటనను సాధారణ ఘటనగా పరిగణించ కుండా,సమగ్ర విచారణ,బాధ్యత నిర్ధారణ,నిబంధనల అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గర్భిణి మృతి ఘటనపై నిజం వెలుగులోకి వస్తుందా?తనిఖీల వెనుక అసలు పర్యవేక్షణ ఉందా?ప్రైవేట్ ఆసుపత్రులపై నియంత్రణ నిజంగా కఠినంగా ఉందా?లేక మరో ఘటన జరిగే వరకు వ్యవస్థ మళ్లీ మౌనంగానే ఉంటుందా?ఈ ప్రశ్నలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# నీటి కోసం గిరిజన విద్యార్థుల అవస్థలు

కౌటగూడ పాఠశాలలో తాగునీటి కొరత..

ఇళ్ల నుంచే బాటిళ్లలో నీరు

**ఆసిఫాబాద్ అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని గిరిజన ప్రాంతమైన కౌటగూడ-జి గ్రామంలోని పాఠశాల విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో తగిన నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు, గ్రామస్థులు చెబుతున్నారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు, భోజనం అనంతరం ప్లేట్లు శుభ్రం చేసేందుకు, శౌచాలయాలను వినియోగించేందుకు కూడా నీటి అవసరం ఉంది. అయితే పాఠశాలలో సరిపడా నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థు



లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులకు తాగునీటి సమస్య ఇబ్బందికరంగా మారిందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీస తాగునీటి



వసతి కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో శాశ్వత నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గూడెం సత్యదేవుని హుండీ ఆదాయం 6.61 లక్షలు



**దండేపల్లి, అక్టోబర్ 5(ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 96 రోజులకు (జూలై 1 నుంచి అక్టోబరు 4 వరకు) సంబంధించి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా స్వామివారికి మొత్తం ?6,61,824 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ బి.సుదర్శన్ నాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, వేద పారాయణదారు డి.నారాయణ శర్మ, అర్చకులు జి.సంపత్‌స్వామి ఆలయ సిబ్బంది, సత్యనారాయణ స్వామి సేవా సమితి సభ్యులు, పోలీసులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## సమ్మె విరమించిన ఆసుపత్రి సిబ్బంది

**యాజమాన్యంతో చర్చలు సఫలం..**
**వేతనాలు పెంపు పెండింగ్ వేతనాలు**
**ఈనెల 18న చెల్లింపు**
**ఐడీ కార్డులు,**
**యూనిఫార్మ్‌లు అందజేత**




**ఆసిఫాబాద్, అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సమ్మె సోమవారం విరమించారు. పెండింగ్ వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ మొత్తాల జమ, అపాయింట్‌మెంట్ లెటర్లు, గుర్తింపు కార్డులు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సిబ్బంది సమ్మె చేపట్టారు. ఈ నేపథ్యంలో భీమ్ సొసైటీ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీకాంత్, ఏఐటీయూసీ నాయకులు ఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, టి.దివాకర్, నీల, మమత, గంగాధర్, జ్ఞానేశ్వర్, మాధవి తదితరులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. చర్చల్లో పలు అంశాలపై ఒప్పందం కుదిరినట్లు నాయకులు తెలిపారు.సిబ్బంది వేతనాలను 10 శాతం పెంచేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇకపై ప్రతి నెల 18వ తేదీన వేతనాలు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. పెండింగ్ వేతనాలను ఈ నెల 18న చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను సిబ్బంది ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే సోమవారం ఐడీ కార్డులు, యూనిఫార్మ్‌లు అందజేసినట్లు తెలిపారు. దీంతో సమ్మెను విరమించినట్లు ఏఐటీయూసీ నాయకులు వెల్లడించారు.

## పాఠశాలలో ఐదు నెలలుగా బోర్ మోటార్ బంద్

**తాగునీటికి విద్యార్థుల ఇబ్బందులు**
**మరమ్మతులు చేయించాలని కోరుతున్న స్థానికులు**




**ఆసిఫాబాద్ అక్టోబర్ 5 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్:** మండలంలోని కొత్త దేమ్మడిగూడ గ్రామంలోని పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. పాఠశాలలోని బోర్ మోటార్ సుమారు ఐదు నెలలుగా పనిచేయకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. బోర్ ఉన్నప్పటికీ మోటార్ పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు.విద్యార్థులకు అవసరమైన తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్ మోటార్‌కు మరమ్మతులు చేయించి పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## అటవీ భూములను ఆక్రమించిన,అమ్మిన, కొన్న కఠిన చర్యలు తప్పవు ఎఫ్డిఓ రామ్మోహన్



**జన్నారం,అక్టోబర్5(ప్రజాజ్యోతి)**అటవీ భూములను ఆక్రమించు కున్న, కబ్జా చేసిన, అమ్మిన గాని, కొన్నా గాని చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబోడునని ఎఫ్డిఓ రామ్మోహన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం రోజు ఏర్పడిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవాల్ టైగర్ రిజర్వ్ జన్నారం డివిజన్ పరిధిలోని ఇందనపల్లి రేంజ్ ఇందన్ పల్లి సెక్షన్ కలమడుగు బీట్ కంపార్ట్ మెంట్ నంబర్ 233 లోని మురిమడుగు గ్రామంలో ఆక్రమణకు గురైన 8 ఎకరాల అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కంపార్ట్ మెంట్ లో గతంలో మూడు నెలల క్రితం 5 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, దీంతో మొత్తం 13 ఎకరాల భూమి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కలమడుగు బీట్ పరిధిలో 530 ఎకరాలకు అటవీ హక్కుల చట్టం కింద జీవనాధారంగా పంటలు పండించుకోవడానికి గిరిజనులకు హక్కులు ఇవ్వబడ్డాయి. కాగా 330 ఎకరాల మేర ఆక్రమణకు గురై ఉందని తెలిపారు.ఆక్రమిత భూములను తిరిగి స్వాధీన పరుచుకునే కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని, అట్టి భూమి తిరిగి ఆక్రమణకు గురికాకుండా చుట్టూ కందకాలను తవ్వడం ద్వారా రక్షణ కల్పించడమైనదని ఆయన తెలిపారు.అటవీ భూమిని ఆక్రమించిన,కబ్జా చేసిన, అమ్మడం లేదా కొనడం వంటివి తీవ్రమైన అటవీ నేరాలని, తెలంగాణ అటవీ చట్టం-1967, వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. అటవీ భూముల ఆక్రమణకు పాల్పడకూడదని, అట్టి భూములను అమ్మడం, కొనడం చేయరాదని హెచ్చరించారు.

## కాకా ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి



**రామకృష్ణాపూర్,అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలను రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయంలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భగత్‌సింగ్ నగర్ హట్స్ ఏరియా పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు, పేదల సంక్షేమం కోసం కాకా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను ప్రజాసేవ ద్వారా కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముఖ శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, పల్లె శ్రీదేవి, కూతురు ప్రభాకర్, చంద్రగిరి శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, నక్క శ్రీనివాస్, పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, గోపతి రాజయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు గంగయ్య, గోపతి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పత్తి సునీత మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్--1, యూనిట్--2 ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను, సమాజ నిర్మాణంలో వారి కీలక పాత్రను కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి మార్గనిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు."ఉపాధ్యాయుడు జ్ఞానానికి మార్గదర్శి విద్యార్థి భవిష్యత్తుకు నిర్మాత" అని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వహీదా, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్--1, యూనిట్--2 సభ్యులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉద్యమకారుల సమితి దండేపల్లి మండల అధ్యక్షులు ఏంబడి సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశానికి

**ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉద్యమనేత,ఉద్యమ కారుల సమితి వ్యవస్థాపకులు,రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్**

**తెలంగాణ ఉద్యమ కారులకు ప్రశంస పత్రం గుర్తింపు కార్డు అందజేసి సన్మాన సత్కారాలు చేయలి:**

**250 గజాల ఇంటి స్థలం,ఇంటి నిర్మాణానికి 15 లక్షలు రూపాలు 25 వేల పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్:**

**అక్టోబర్5,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ఉద్యమకారుల సమితి దండేపల్లి మండల అధ్యక్షులు ఏంబడీ సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉద్యమ కారుల సమావేశానికి ఉద్యమకారుల సమితి వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఉద్యమ కారుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్.మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రామిడి కుమార్ తో కలిసి ఉద్యమకారుల సమితి వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు,ఉద్యమనేత తోడేటి శంకర్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్నటు వంటి నిజమైన ఉద్యమ కారులకు శాలువలతో ఘనంగా సన్మానించి సత్కరించి ప్రశంస పత్రాలు గుర్తింపు కార్డులు అందజేయాలని అన్నారు.అదేవిధంగా ఉద్యమకారులకు 25 వేల పెన్షన్ ను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 15 లక్షల రూపాయలు అందజేయాలని అన్నారు.ఉద్యమ కారులకు



కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రయాణించడానికి బస్సు,రైల్వే పాసులు అందజేయాలని అన్నారు..20లక్షలు హెల్త్ కార్డు కల్పించాలన్నారు. ఉద్యమకారుల కుటుంబాలకు 20 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల న్నారు.ఉద్యమకారుల సంక్షేమానికి 10 వేల కోట్లతో బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పైన పేర్కొన్న ఉద్యమకారుల డిమాండ్లను డిసెంబర్ 9 తేదీ వరకు నెరవేర్చి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషదాయకమైన మంచి వార్తను ప్రకటించాలని కోరారు. లేని యెడల తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి పక్షాన రాష్ట్ర ఉద్యమకారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమానికి శ్రీకారం చూస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ



కారుల సమితి రాష్ట్ర కార్యదర్శి గోమతి రాజయ్య, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కత్తెర వల్ల రమేష్. కోల శ్రీనివాస్ ఠాకూర్ సుశీల్ కుమార్ మాజీ మండల అధ్యక్షులు గొల్ల రాయమల్లు,జేఏసీ అధ్యక్షులు పేరామాండ్ల శెంకర్ గౌడ్,గాడి కొప్పుల సురేందర్, గుండ రవీందర్, శీర్ల వెంకటేశ్వర్లు, కుదురుపాక గంగయ్య, పిట్టల రాజన్న,మర్రిపల్లి వెంకటేష్,తోట శెంకర్, బొమ్మెనా సత్యం, సందెల తిరుపతి, చుంచు శెంకర్, కాశెట్టి శెంకర్, ఇస్లావత్ శెంకర్, మాడవి హన్మంత్, కొంరం భీమారావు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక దృష్టి






## అధికారులకు మంత్రులు పొంగులేటి, జూపల్లి ఆదేశాలు

**ఆసిఫాబాద్ అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ సేవలు, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు. కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ కె.హరితతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెవెన్యూ శాఖలో పెండింగ్ దరఖాస్తులు, భూ సమస్యలు, భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, భూ హక్కులకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, ఆక్రమణలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని కూడా మంత్రులు సమీక్షించారు. మంజూరైన ఇళ్లు, ప్రారంభమైనవి, వివిధ దశల్లో ఉన్నవి, పూర్తయిన ఇళ్ల వివరాలను జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థలం, నిర్మాణ సామగ్రి, అనుమతులు, అటవీ సమస్యల కారణంగా పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో మంద మకరంద్‌తో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

**లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలి**

**సింగరేణి మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి**

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**సింగరేణి భవన్ ఎదుట టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన**

**కల్వకుంట్ల కవిత**



**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు (అలియాస్ నేమ్స్), విజిలెన్స్ విచారణ కేసులతో పాటు కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట టీఆర్ఎస్ పార్టీ, హెచ్ఎంఎస్ సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత పాల్గొని కార్మికులు, బాధిత కుటుంబాల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, భూపాలపల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా మారుపేర్ల సమస్యకు తక్షణమే పరిష్కారం చూపి అర్హులైన వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ పేరుతో ఉద్యోగాలు నిలిపివేసిన డిపెండెంట్లకు కూడా న్యాయం చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని, 'ఇప్పుడూ--అప్పుడూ' అంటూ కాలయాపన చేయకుండా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు విజిలెన్స్ విచారణ పేరుతో ఉద్యోగాలు నిలిపివేసిన డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ప్రతి సింగరేణి కార్మికుడికి సొంత ఇంటి నిర్మాణ పథకం కోసం రెండు గుంటల భూమి ఇవ్వాలని, సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని, సింగరేణి కార్మికులపై ఆదాయపు పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం సింగరేణికి బాకీ పడిన రూ.62 వేల కోట్లను వెంటనే చెల్లించాలని కోరారు. సింగరేణి మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, బాధిత కుటుంబాల సభ్యులు, కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

**మంత్రులను కోరిన ఎమ్మెల్యే**




**నేరడిగొండ అక్టోబర్ 06 (ప్రజాజ్యోతి):** బోథ్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. నిర్మల్



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే హాజరై నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బోథ్‌లో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉంటే ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, వేగంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే బోథ్ నియోజకవర్గ ప్రజల చిరకాల డిమాండ్‌గా ఉన్న బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బోథ్‌కు మంజూరైన డయాలసిస్ సెంటర్ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోథ్‌లో డయాలసిస్ సెంటర్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఇచ్చోడ మండల కేంద్రంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) మంజూరు చేయాలని మంత్రులను కోరారు. అటవీ సమస్యలపై కూడా ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించారు. నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల్లో భూ, అటవీ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అటవీ అధికారుల వైఖరి కారణంగా అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు. అటవీ హక్కుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనేతరులకు నిబంధనల ప్రకారం అటవీ హక్కు పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన ఈ ప్రధాన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**ఫిర్యాదులపై సత్వరమే చట్టపరమైన చర్యలు**



**ఆసిఫాబాద్ అక్టోబర్ 5 ప్రజా జ్యోతి** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి చట్టపరమైన పరిష్కారం అందించేందుకు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా వివరించారు. ఫిర్యాదులను సావధానంగా విన్న ఎస్పీ.. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసుశాఖ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

## వన్యప్రాణి వారోత్సవాలు భాగంగా అడవి జంతువుల సంరక్షణ పై అవగాహన కల్పించిన అటవీ శాఖ అధికారులు

**బాలుర ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థు లతో కలిసి ర్యాలీ ఫారెస్ట్ కార్యాలయం వరకు ర్యాలీ**

**అడవులను సంరక్షించి వన్యప్రాణులను సుక్షించాలి సిర్పూర్ (టి) ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్:**






**అక్టోబర్ 5, సిర్పూర్(టి) కానిస్టేన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని అట్టి సందర్భంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థు లతో కలిసి ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల నుండి అటవీ క్షేత్ర అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ క్షేత్రాధికారి చెరుకు శ్రీనివాస్, డి ఆర్ఓ తిరుపతి,సెక్షన్ ఆఫీసర్లు బాలాజీ, మోహన్ రావు, తులసీ దాస్ నాయక్, అతరుద్దీన్,అత్తర్, రజిత, లతో కలిసి అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సురక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అడవుల రక్షణ తో పాటు వన్య ప్రాణులను సంరక్షించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్ర మంలో బీట్ ఆఫీసర్లు, వాచర్లు, పాఠశాలల ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలి

## హిందూ ఐక్యతకు గణపతి నవరాత్రులు ప్రతీక

## మంచిర్యాల ఎం కన్వెన్షన్ హాల్‌లో కన్నుల పండుగగా బహుమతుల ప్రదానోత్సవం

## 222 గణనాథుల మండపాలతో మంచిర్యాలలో గణపతి వైభవం








**మంచిర్యాల, 5,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు, గణపతి నిమజ్జన స్వాగత ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా సోమవారం మంచిర్యాల ఎం కన్వెన్షన్ హాల్‌లో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా, కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు డేగ రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్ కొనసాగించారు. తొలుత ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తిపూర్వకంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు కేవలం పండుగ మాత్రమే కాదని, హిందూ సమాజాన్ని ఐక్యంగా నిలబెట్టే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలని ఈ సందర్భంగా వక్తలు అన్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా ప్రజల్లో భక్తి, ఆధ్యాత్మిక చైతన్యం, సామాజిక ఐక్యత పెరుగుతాయని పేర్కొన్నారు. గణపతి ఉత్సవాలు పిల్లలు, యువతకు భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. మంచిర్యాల పట్టణంలో దాదాపు 222 గణనాథుల మండపాలు ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారని తెలిపారు. ఈ ఏడాది అనేక మండపాల వద్ద మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఇళ్లలో కూడా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సంప్రదాయాలను కాపాడే దిశగా మట్టి గణపతుల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా భక్తి.. ఐక్యత.. ధర్మజాగరణకు వేదిక అని వక్తలు అన్నారు .గణపతి నవరాత్రులు భారతీయ సనాతన సంస్కృతిలో భక్తి, జ్ఞానం, వివేకం, శుభారంభానికి ప్రతీకగా నిలిచాయని వక్తలు వివరించారు. విద్య, బుద్ధి, వివేకానికి అధిదేవతగా గణపతిని కొలుస్తామని, ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణేశుని పూజించే సంప్రదాయం భారతీయ సంస్కృతిలో అనాదిగా కొనసాగుతోందన్నారు. ఉత్సవాలు కేవలం వేడుకలకు పరిమితం కాకుండా సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ధర్మజాగరణ, యువతలో సాంస్కృతిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలకు వేదిక కావాలని సూచించారు.

### సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలి

సనాతన ధర్మం అంటే కేవలం పూజలు, ఆచారాలు మాత్రమే కాదని, సత్యం, ధర్మం, దయ, సేవ, పరస్పర గౌరవం, ప్రకృతి పరిరక్షణ, మానవతా విలువల సమాహారమని వక్తలు పేర్కొన్నారు. ఈ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత సనాతన సంస్కృతి, భారతీయ సంప్రదాయాలను తెలుసుకుని వాటి పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి, ధర్మచింతన, సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఐబి చౌరస్తాలో నిమజ్జన స్వాగత ఉత్సవం

మంచిర్యాలలో ప్రతి సంవత్సరం ముఖరం చౌరస్తాలో నిర్వహించే గణపతి నిమజ్జన స్వాగత ఉత్సవాన్ని ఈ ఏడాది పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల కారణంగా ఐబి చౌరస్తా సమీపంలోని విశాలమైన హనుమాన్ ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు ఈ విషయం వివరించగా ఆయన సహకారంతో విశాలమైన ప్రదేశంలో స్వాగత వేదికను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించామని చెప్పారు. ఐవీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణనాథుల స్వాగత వేదికకు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఇకపై ప్రతి సంవత్సరం ఐవీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం సమీపంలోని విశాలమైన ప్రదేశంలోనే గణపతి నిమజ్జన స్వాగత ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి నాయకులు ప్రకటించారు. ఇందుకు మండపాల నిర్వాహకులు, భక్తులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

### శివాజీ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్మరించుకుంటూ వక్తలు మాట్లాడుతూ.. భారతదేశంలో హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో శివాజీ మహారాజ్ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్మరణీయమన్నారు. ధర్మం, ప్రజల రక్షణ, స్వాభిమానం, సాంస్కృతిక పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మంచిర్యాలలో కూడా శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. యువత శివాజీ జీవితం, దేశభక్తి, ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం వంటి అంశాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రతి గణేష్ మండపం వద్ద సేవా కార్యక్రమాలు, శాంతిభద్రతలు, భక్తులకు అవసరమైన సహాయ కార్యక్రమాల నిర్వహణ కోసం నలుగురు యువకులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా మండపాల నిర్వాహకులు నలుగురు యువకుల పేర్లను మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి సభ్యులకు తెలియజేయాలని సూచించారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు ఘన సన్మానం చేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, ప్రముఖులు, మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి నాయకులు, వివిధ మండపాల నిర్వాహకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, గణపతి చిత్రంతో ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞాపికలను మెమొంటోలుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించి, గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన స్వాగత కార్యక్రమాల విజయవంతానికి వారు అందించిన సహకారాన్ని అభినందించారు. సన్మాన కార్యక్రమం బహుమతుల ప్రదానోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### మండపాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు

మంచిర్యాల పట్టణాన్ని ఒకటి, రెండు టౌన్లుగా విభజించి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు, విగ్రహాల అలంకరణ, నిర్వహణ, భక్తి వాతావరణం తదితర అంశాలను పరిశీలించేందుకు న్యాయనిర్ణేతలు, సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి పరిశీలన ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 20 కన్సొలేషన్ బహుమతులను ఎంపిక చేసి మండపాల నిర్వాహకులకు అందజేశారు. దీంతో బహుమతుల ప్రదానోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి శాంతిభద్రతలను కాపాడిన పోలీసు అధికారులు, సిబ్బందికి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు, ముఖ్యంగా ప్రతిరోజూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన పారిశుద్ధ్య కార్మికులకు మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఉత్సవాల సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు, సనాతన ధర్మ పరిరక్షణకు ఆర్థికంగా సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంచిర్యాలలో ఈ ఏడాది గణపతి నవరాత్రులతో పాటు గణపతి నిమజ్జన స్వాగత ఉత్సవాలు గతంలో కంటే మరింత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మంచిర్యాల హిందూ ఉత్సవ సమితి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే స్ఫూర్తితో గణపతి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తూ హిందూ ఐక్యత, ధర్మజాగరణ, సనాతన సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి కోశాధికారి ముత్యాల కృష్ణ, ఉపాధ్యక్షులు ఇరుకుల్ల సూర్యనారాయణ, రామగిరి శ్రీనివాస్, సలహాదారులు, మంచిర్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్, హిందూ ఉత్సవ సమితి సీనియర్ నాయకులు గొనె శ్యాం సుందర్ రావ్ , మందమర్రి కామాఖ్య ఆలయ నిర్వాహకులు, పీఠాధిపతి సతీష్ భవాని, అఘోర రఘు గురుస్వామి, అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, రవి, వివిధ మండపాల నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అవక తవకలకు బాధ్యతవహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను బర్తరఫ్ చేయాలి

## ఇండియా కూటమి నాయ కులు నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి)** ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో జరుగుతున్న అవకతవకల ను తీవ్రంగా నిరసిస్తూ, భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సి ఈ సి) జ్ఞానేశ్ కుమార్‌ను బర్తర ఫ్ చేయాలని డిమాండ్ చే స్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నేడుఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుటధర్నా నిర్వహించనున్నట్లు ఇండియా కూటమి నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇండియా కూటమి ప్రతినిధులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా నరేష్ జాదవ్ మా ట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న అవకతవకలు ప్రజల ఓటు హక్కుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వా మ్యంలో ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఓటు హక్కు అత్యంత కీలకమని, ఆ హక్కుకు ఎలాంటి భంగం కల గకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపా తంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ ఐఆర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజలకు అనుమానం కలిగించే పరిస్థి తులకు తావు లేకుండా సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్ర జలకు విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ ఎ న్నికల ప్రధాన కమిషనర్ జ్ఞా నేశ్ కుమార్‌ను బర్తరఫ్ చే యాలని డిమాండ్ చేస్తూ నే డు ఉదయం 10:00 గంట లకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మానికి ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల, పట్ట ణ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, నా యకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఎస్ ఐఆర్ అవకతవకలకు వ్యతిరేకంగా గళమెత్తుదాం ఓటు హక్కును కాపాడుకుందాం ప్రజాస్వామ్యాన్ని పరి రక్షిద్దాం” అని ఇండియా కూ టమి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, సిపిఐ ప్రభాకర్ రెడ్డి, సిపిఎం పార్టీ నుండి బండి దత్తాత్రే, సిపిఎం డి స్ట్రిక్ట్ సెక్రటరీ మల్లేష్, ఎంఐ ఎం పట్టణ అధ్యక్షులు నజీ ర్ అహ్మద్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిస్టిక్ సెక్రెటరీ జ గన్ సింగ్, ఎం సిపిఐ నాయకులు కుంటాల రాములు, ఆమ్ ఆద్మీపార్టీ నుండి రా థోడ్ సుభాష్, సిపిఐఎం ఎల్ న్యూడెమోక్రసి నుండి మడావి గణేష్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జి తేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ ఆడె క్రాంతి కుమార్

### 946 ఓట్ల భారీ మెజార్టీతో రాథోడ్ జైసింగ్ రికార్డ్ విజయం

### ఆదిలాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఇద్దరు నేతల హవా

### నియామక పత్రాలు అందజేసిన అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5,(ప్రజా జ్యోతి)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సిఎస్) ఆదిలాబాద్ జిల్లా బ్రాంచ్ ఎన్నికల్లో ఊ హించినట్లుగానే డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, రాథోడ్ జై సింగ్ ల హవా కొనసాగింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించిన డాక్టర్ ఆడె క్రాంతి కుమార్ ప్రతిష్టాత్మకమైన రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. మరో వైపు అసాధారణ ప్రజాదర ణతో రాథోడ్ జైసింగ్ ఏకంగా 946 ఓట్ల భారీ మెజార్టీ సాధించి రికార్డ్ స్థాయి విజయాన్ని తన సొంతం చేసు కున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి, జెడ్పీపీ సీఈఓ బి. రవి పర్యవేక్షణలో అక్టోబర్ 4న జెడ్పీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో రహస్య ఓటింగ్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం15 మంది కమిటీ సభ్యుల స్థానాల కోసం 46 మంది అభ్యర్థులు బరిలో ని లవగా, ఓటర్లు డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, రాథోడ్ జై సింగ్‌ల నాయకత్వానికి బ్రహ్మరథం పట్టారు. ఈ ఎన్నికల్లో వీరిద్దరితో పాటు బండారి కృష్ణ, నెమ్మని రాజేశ్వర్ రావు, జొంపల్లి సంజీవ్ రావు, నాంపెల్లి సౌందర్య, భాగత్ సునీత కుమారి, సామ రూపేష్ రెడ్డి, చింతకుంట వెంకట నారాయణ రాజు, సామె రమేష్ రెడ్డి, మామిడిపల్లి మనోహర్, మాసం అనిల్, కుర్మే విశ్వనాథ్, ప ట్వార్ గజానన్, కొరెడ్డి పార్థసారథిలు కూడా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్ని కయ్యారు. నూతనంగా ఎన్నికైన ఈ కార్యవర్గం రాబో యే మూడేళ్ల పాటు జిల్లాలో రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను విస్తరించనుంది. చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ ఆడె క్రాంతి కుమార్, భారీ మెజార్టీ సాధించిన రాథోడ్ జైసింగ్ లకు జిల్లాలోని పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

## లక్ష్మణచందా పీహెచ్‌సీలో దయనీయ పరిస్థితులు



**మామడ అక్టోబర్ 6( ప్రజా జ్యోతి)** లక్ష్మణచందా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో పైకప్పు, గోడల నుంచి పెచ్చులు ఊడి నేలపై భారీగా శిథిలాలు పేరుకుపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. వైద్య సేవలు అందించే ప్రదేశంలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో సిబ్బంది, రోగులు ఆందోళనకు గురవుతున్నారు. గదిలోని టేబుళ్లు, వైద్య సామగ్రి చుట్టూ పైకప్పు నుంచి ఊడిన పెచ్చులు, నిర్మాణ శిథిలాలు చెల్లాచెదురుగా కనిపిస్తున్నాయి. మందులు, వైద్య పరికరాలు ఉంచే ప్రదేశం కూడా సరైన నిర్వహణ లేక ఇబ్బందికరంగా కనిపిస్తోంది. పైకప్పు మరింత దెబ్బతింటే పెచ్చులు ఊడి సిబ్బంది లేదా రోగులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు వైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న భవన భాగాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు గదులను శుభ్రపరిచి, సురక్షితమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రిసాట్ల పేరుతో ప్రభుత్వ భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్



**హన్స్ న్యూస్ సర్వీస్ ఖానాపూర్** అశోక్ రిసార్ట్ ల పేరుతో ప్రభు త్వ భూమిని రాజేష్ సొంతంగా వ్యాపారం చేసుకుంటు న్నాం బడా నాయకులపై చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ అన్నారు అదిలాబాద్ జిల్లా సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల సమక్షంలో ఈ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్రానికి చెందిన పలు ఉన్నత శాఖల ముఖ్య కార్యదర్శులు కూడా పాల్గొనగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ్మ బొజ్జోపటేల్ కడెం మండలంలో ప్రభుత్వ భూములను కాజేస్తున్న వైనాన్ని మంత్రుల దృష్టికి ముక్క కార్యదర్శుల దృష్టికి తీసుకువచ్చారు దీనిపై సమగ్రంగా సమగ్రంగా పరిశీలించి కాజేసిన వారిపై చట్టరిత చర్యలు తీసుకోవాలని మంత్రాలని కోరారు అలాగే నియోజకవర్గంలో 700 వందలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం చేస్తుంటే అటవీశాఖ వాళ్ళు కోర్ ఏరియా పరిధిలో ఉన్నాయన్న నిర్మాణాలను అడ్డుకుంటున్నారని దీంతో ఆదివాసులు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని కూడా మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రాంతంలోనే గిరిజనులు ఇంద్రమ్మ ఇల్లు నిర్మించుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డు తగలడం సరికాదని ఈ సమరక్షణ కూడా పరిష్కరించాలని మంత్రులను ఎడమ బొజ్జోపటేల్ కోరారు

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**సోనాల, అక్టోబర్ 05 ( ప్రజాజ్యోతి ):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఉద్యమ నాయకులు షేక్ మహమూద్, అమృత్‌రావు పాటిల్, ప్రజావాణిలో ఎంపీడీవో రత్నాకర్ రావు కు ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా, స్వరాష్ట్ర స్వప్నం కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలై, తీవ్రంగా గాయపడిన ఎంతోమంది పోరాట యోధులు నేటికీ ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది ఉద్యమకారులు ఉపాధి లేక, ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు.

## ప్రకటించని పిఎసిఎస్ లు ఆశావాహుల్లో ఆందోళన

### సోషల్ మీడియాలో పుకార్లు నమ్మొద్దు



**ఖానాపూర్ అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి )** ముగిసిపోయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గాలు గతంలో ప్రత్యక్ష ఎన్నికలతో కొలువుతీరగా, ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ ప్రతిపాదికన కొలువులు ఇస్తున్నట్లు ప్రకటించడం ఆశావాహుల్లో ఒక ఇంత సంతోషం ఉన్న అవి ఇప్పటికీ ప్రకటించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు దీనికి తోడు నిర్మల్ జిల్లాలో పి ఎస్ ఎస్ పాలకవర్గాల ప్రకటించినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం కావడంతో అధికారికంగా ఇంకా ప్రకటించలేదని ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ సోషల్ మీడియాలో వివిధ ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ వాట్సాప్ లో ప్రకటించడం గమనార్హం అయితే పి ఎస్ ఎస్ చైర్మన్ వైస్ చైర్మన్ లతో పాటు డైరెక్టర్ సభ్యుల పదవులు తమకు వస్తాయన్న ఆశతో ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు ప్రత్యక్షంగా కాకుండా నామినేట్ గా ప్రకటించడంలో ప్రభుత్వం ఎందుకు తాసరం చేస్తుందో అర్థం కావడం లేదని వాపో తుంటే కొంతమంది పిఎసిఎస్ చైర్మన్ లు తమనే కొనసాగించాలని కోర్టును ఆశ్రయించడం వల్ల డిలే జరుగుతుందని తెలుస్తోంది ఏది ఏమైనా పిఎసిఎస్ పాలకవర్గాల్లో తొందరగా నిర్ణయాలు తీసుకొని ప్రకటించాలని లేదా ప్రత్యక్ష ఎన్నికల తో నైనా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆశా వాహులు కోరుతున్నారు

## స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత



**ఖానాపూర్ అక్టోబర్ 5( ప్రజా జ్యోతి )** స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగం గా నిర్మల్ జిల్లా ఖా నాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను సోమ వారం డి సి హెచ్ ఎస్ డాక్టర్ కాశీనాథ్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డి ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రపరిచారు ఎప్పటికప్పుడు పరిశుద్ధ కార్మికులు పరిసరాల్లో చెత్త చెదరం లేకుండా చూడాలని ఆసుపత్రికి చికిత్సలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రత వాతావరణాన్ని నెలకొల్పేలా చూసుకోవాలని డి సి హెచ్ ఎస్ డాక్టర్ కాశీనాథ్ అన్నారు ఈ కార్యక్రమంలో సంజిత స్వరూప మమత లతోపాటు కే శ్రీనివాస చారి సీనియర్ ఫార్మసిస్ట్ తోపాటు పారిశుద్ధ కార్మికులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

### ఐటీడీఏ ఉట్నూర్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జాదవ్ వసంత్ రావు



**ఉట్నూర్, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఏ పి ఓ జాదవ్ వసంత్ రావు అధికారులను ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించి న ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరి శీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జైనూర్ మండలం జంగావ్ గ్రామానికి చెందిన వసంత్ రావు తనకి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఇంద్రవెల్లి మండలం పిట్ట బొంగరం గ్రామానికి చెందిన ఉమేశ్వరి తనకు నర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. గాదిగూడ మండలం లొద్దిగూడ గ్రామానికి చెందిన జ్యోతిబాయ్ తనకు ఏడ్ల జత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఇంద్రవెల్లి మండలం అరకపూర్ గ్రామానికి చెందిన రామారావు తన కు ఎడ్ల జత చనిపోయి నందుకు దాని బదులుగా ఆర్థిక సహాయం చేయమని మంజూరు కొరకు దరఖాస్తు అందజేశారు.అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల లబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ వినతి పత్రాలను సమర్పించారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్య తాయుతంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరిత గతిన పరిష్కరించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జాదవ్ వసంత్ రావ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో ఐ టీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పార్డి కే గ్రామంలో ముమ్మరంగా 'ఇందిరమ్మ ఇండ్ల' సర్వే



**సోనాల, అక్టోబర్ 05 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల పరిధిలోని పార్డి కే గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సోమవారం సమగ్ర సర్వే నిర్వహించారు. అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక సర్వే అధికారులైన వెటర్నరీ డాక్టర్ సుశీల్ కుమార్. ఏవో దేవరావు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆమనిక, సర్వే బృందం సభ్యులు మాట్లాడుతూ.. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు, పూరి గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి ఆన్‌లైన్ డేటాలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన వాయిదా

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి)**మంగళవారం (నేడు) ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన అని వార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. మంత్రి పర్యటన కార్యక్రమంలో చోటు చేసుకున్న ఈ మార్పును అధికారులు గమనించాలని కోరారు.

## ఆటోబోల్తా ఒకరు మృతి పలువురికి గాయాలు



**కడెం, అక్టోబర్ 5(ప్రజా జ్యోతి):** నిర్మల్ జిల్లా కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఖానాపూర్ నుండి కడెం వైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు అక్కడి కక్కడే మృతి చెందారు. ఖానాపూర్ నుంచి స్వగ్రామం కడెం మండలం న్యూధర్మాజీపేట్ కు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి బోల్తా పడగా ఆటోలో ప్రయాణిస్తున్న పుదారి నడిపి భీమ య్య (55) అనే వ్య క్తి అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి స్వల్పగా యాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షత గాత్రులను అంబులెన్స్‌లో ఖానా పూర్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# బ్యాంక్ అధికారులమంటూ సైబర్ మోసాలు నిందితుడి అరెస్ట్

**క్రెడిట్ కార్డు వివరాలు, ఓటి పిలు ఆదిలాబాద్ బాధితుని వద్ద రూ.73,279 మోసం**

**మహారాష్ట్ర, గోవా, తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు 15 0 ఫిర్యాదులు నమోదు**

**మూడు రాష్ట్రాల బాధితుల వద్ద 95 లక్షల వరకుమోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**మహారాష్ట్రలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఆదిలాబాద్ 1 టౌన్ పోలీసులు**

**నిందితుడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం**





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** చైతన్య ప్రమోద్ కుటె (25), నా/శీ ప్రమోద్ కుటె, డబ్కి రోడ్డు, గురుకృప ప్రొవిజన్ సమీపంలో, మెహరేనగర్,ఖూరడ్ పోస్ట్, అకోలా గ్రామీణ, అకోలా జిల్లా, మహా రాష్ట్ర. (ప్రస్తుతం పింప్రి- చించ్వాడ్, పూణే, మహారాష్ట్ర అనే నిందితున్ని అరెస్టు చేసిరి మాండ్ కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ తెలి పారు.బ్యాంక్ అధికారుల మంటూ ప్రజలకు ఫోన్ చేసి, వారి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ ఖాతాలకు సంబం ధించిన వివరాలు, ఓటిపిలు సేకరించి డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పత్రిక సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ బ్రాహ్మణవాడ కు చెందిన బాధితుడు ప్రఫుల్ పాటిల్కు 2026 జూలై నెలలో బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, అతని క్రెడిట్ కార్డును యాక్టివేట్ చేస్తా మని నమ్మించి సైబర్ మోసానికి పాల్పడి రూ.73,27 9/- కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదిలాబా ద్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.633/2026 నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు.దర్యాప్తులో భాగంగా ఎన్ సి ఆర్ పి పోర్టల్ ద్వా రాలభించిన సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఆది లాబాద్ 1 టౌన్ ఆధ్వర్యం లోని పోలీసు బృందం మహారాష్ట్రకు వెళ్లి నిందితుడి ని అదుపులోకి తీసుకుని ఆదిలాబాద్‌కు తీసుకువచ్చిం ది.పోలీసుల విచారణలో నిందితుడు తాను గతంలో యాక్సిస్ బ్యాంక్‌లో పని చే సిన సమయంలో కస్టమర్లతో మాట్లాడిన అనుభవాన్ని ఉపయోగిం చుకుని, బ్యాంక్ కస్టమర్లకు సంబంధించిన మొబైల్ నంబర్లను సేకరించి నట్లు తెలిపాడు. అనంతరం వివిధ సిమ్ కార్డులు, మొ బైల్ ఫోన్లు ఉపయోగిస్తూ బ్యాంక్ అధికారులమంటూ కస్టమర్లకు ఫోన్ చేసి, వారి క్రెడిట్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపిలను తె లుసుకుని డబ్బులను వివిధ యుపిఐ, ఆమెజాన్ ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు తెలిపాడు. నిందితడు తెలంగాణ, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలలో దాదాపు 150 మంది బాధితుల వద్ద రూ 95,33,651/- నగదు నష్ట పోయినట్లు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదులను నమోదు అయినట్లు తెలిపారు.అదేవిధంగా 23. 07.2026న బాధితుడికి ఎచ్ డి ఎఫ్ సి బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి, క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో నమ్మించి, ఓటిపిలను తెలుసుకుని ఐదులా వాదేవీల ద్వారా మొత్తం రూ.73,279/- బదిలీ చేసు కున్నట్లు విచారణలో తెలిపి నట్లు పోలీసులు వెల్లడించారు.నిందితుడు మోసాలకు ఉపయోగించినట్లు తెలిపిన మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు కూడా విచారణలో వెల్లడించాడు. అలాగే వివిధ మొబైల్ నంబర్లతో సిమ్ కార్డులు మార్చుతూ, మొబైల్ ఫోన్లు మార్చుతూ సైబర్ మోసాలకు పాల్పడి నట్లు తెలిపాడు.

**నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నవి**

టొయోట హైరైడర్ కారు -- రి.నం. ఎంఎచ్ -14- ఎంసి -1167, ఏపుల్ ఐ ఫోన్ 13 మొబైల్ ఫోన్, మోటో జి 67 మొబైల్ ఫోన్,వివిధ సిమ్ కార్డులు స్వాదీనం చేసు కు న్నట్లు తెలిపారు. నిందితుడి పై చట్టపరమైన చర్యలు కొ నసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు బ్యాంక్ అధికారులు, పోలీసు అధి కారులు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానా స్పద ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ టిపి, పిన్,సివివి, క్రెడిట్/డె బిట్ కార్డు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించా రు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.కేసులో కీలకంగా వ్యవ హరించిన సిబ్బంది ప్రతి ఒ క్కరికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నగదు రివార్డులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ 1 టౌన్ ఇన్స్పెక్టర్ బి.సునీల్ కుమార్, ఎస్ఐ లు గోపికృష్ణ, అశోక్, పోలీ సు సిబ్బంది, సైబర్ క్రైమ్ కీలకంగా వ్యవహరించారు.

## ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి

**పోలీస్ ముఖ్య కార్యాలయంలో 53 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ**

**సోమవారం గ్రీవెన్స్ డే**

**సంబంధిత పోలీసు అధికా రులకు ఫోన్ ద్వారా వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు**

**అసాంఘిక కార్యకలాపాలపై సమాచారంఅందించేందుకు ప్రజలు ముందుకు రావాలి**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 5,(ప్రజా జ్యోతి)** ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖి ల్ మహజాన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలోని ర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 53 ఫిర్యాదు లను జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ ఐపీఎస్ నేరుగా స్వీ కరించారు. ప్రతి ఫిర్యాదుదా రుడి సమస్యను ఓర్పుగా వి ని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను త క్షణమే స్వీకరించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని, బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రతి ఫిర్యా దును పారదర్శకంగా, నిష్ప క్షపాతంగా విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఫిర్యా దులను అందజేసిన వారిలో కుటుంబ కలహాలు, కేసుల వివరాలు, ఫోర్జరీ సమస్య లు, భార్య భర్తల సమస్య లు తదితరా అంశాలతో జిల్లా ఎస్పీకి తమ సమస్య లను తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అసాం ఘిక కార్యకలా పాలు, మాద కద్రవ్యాల విక్రయాలు, చట్ట వ్యతిరేక చర్యలపై సమాచారం ఉన్న వెంటనే 871265 9973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.

